క్లుప్తంగా

శ్రీ మద్దిలేటి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు



విరాళం నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాస శనివారం భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ.5,75,742 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. ఆలయాభివృద్ధికి ప్రకాశం జిల్లా, గిద్దలూరుకు చెందిన చౌడ బోయిన మద్దిలేటి జ్ఞాపకార్థం కొడుకు వెంకటరమణ, విజయలక్ష్మి దంపతులు రూ.55,116, నంద్యాల మండలం, పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, మంజులాదేవి దంపతులు రూ.50,116 విరాళంగా అందజేశారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామివారి పట్టు వస్త్రంతో సత్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



నీటి సమస్యపై చర్చిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోసంజీవనగర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. శనివారం స్థానికులతో మాట్లాడిన వారు కాలనీకి సమీపాన బోరుబావిని తవ్వించారు. సుమారు మూడు ఇంచుల నీరు పడటంతో యుద్ధప్రాతిపాదికన మోటార్ ఏర్పాటు చేసి కాలనీల్లో ట్యాంకులకు నీరు అందిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ వైఎస్సార్ నాయకులు నిరంజన్, రామనాయుడు, మధు, తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ

డోన్ : దివంగత న్యాయవాది యాపదిన్నె రంగారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ప్రభుత్వాసుపత్రిలో రోగులు, బాలింతలు, గర్భిణులకు రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్‌టి అరుణ్, వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ హర్షణీయం

కోవెలకుంట్ల: జూనియర్ కళాశాలల ఒప్పంద అధ్యాపకులకు బదిలీల ప్రక్రియ చేపట్టడం హర్షణీయమని ఆ సంఘం జేఏసీ నాయకుడు అబ్దుల్ జబ్బార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాలను జోన్‌గా ప్రకటించి అధ్యాపకులకు రిక్వెస్ట్ బదిలీలు నిర్వహించడం శుభ పరిణామం అని కొనియాడారు. జోన్ పరిధిలోని జిల్లాలకు చెందిన 50 మంది అధ్యాపకులు వారు కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యారని స్పష్టం చేశారు.

రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష



లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

అవుకు: మండల కేంద్రం అవుకు-2 సచివాలయ పరిధిలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సుంకేసుల గ్రామంలో ఈఓఆర్డీ రామకృష్ణవేణి శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అవుకు-2లో 255 మందికి, సుంకేసులలో 204 మందికి అధికారులు వివిధ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఏపీఎం విజయగోపాల్, ఈఓ అశ్విన్ కుమార్, ఆర్‌ఐ రాముడు, సుంకేసుల సర్పంచ్ పద్మావతి, ఉప సర్పంచ్ పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని ఎగ్గొని గ్రామానికి చెందిన సంజీవకుమార్(42) శనివారం విష పూరిత గులిగలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రాజమణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి 8గంటల సమయంలో భర్త విష పూరిత గులికలు మింగిన విషయాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు భార్య తెలిపింది. మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



డోన్‌లో ఏటికి గుర్రంపై బయలుదేరిన యి కొత్తపల్లె మౌలాలిస్వామి



కొత్తపల్లెలో విచిత్ర వేషధారణతో సందడి చేస్తున్న దృశ్యం



డోన్‌లో విచిత్ర వేషధారణల్లో కళాకారులు



బేతంచెర్లలో గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న కోటపేట పీర్లు



కోవెలకుంట్లలో పీర్ల ఉరేగింపుకు హాజరైన భక్తులు

ముగిసిన మొహర్రం

- వేడుకగా సాగిన పీర్లదేవుళ్ల ఊరేగింపు
- స్వాములను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు
- పీర్ల ప్రక్షాళన చేశాక శోకగీతాలు ఆలపించిన నిర్వాహకులు



బనగానపల్లిలో మాతం నిర్వహిస్తున్న షియా మతస్తులు



ప్యాపిలిలో నిప్పుల మీద నడుస్తున్న పీర్ల స్వామి



కోవెలకుంట్లలో పీర్ల ఊరేగింపు

ప్యాపిలి: మొహర్రం వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. మండల కేంద్రం ప్యాపిలోపాటు గ్రామాల్లో పీర్లదేవుళ్ల ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య వేడుకలా సాగింది. కులమతాలకు అతీతంగా భక్తులు స్వాములను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు దప్పువాయిద్యాల మధ్య సాగిన ఊరేగింపులో యువకులు లయబద్ధంగా నృత్యాలు చేశారు. చిత్ర విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్థానిక వెంగన్న బావి వద్ద పీర్ల స్వాములను ప్రక్షాళన చేసి ప్రత్యేక పెట్టెల్లో భద్రపరిచారు. ఈ సందర్భంగా పీర్ల నిర్వాహకులు శోక గీతాలు ఆలపించారు. అనంతరం పీర్లదేవుళ్లను చావిళ్లలో ఉంచారు.

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లెలో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా దొరకోటలోని పీర్ల చావిడిలో బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజలే అలీఖాన్, ఆయన కుమారుడు గులాంఅలీఖాన్ ఆధ్వర్యంలో షియా మతస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పీర్ల నిమజ్జనం ప్రారంభమైంది. పీర్లను జుర్రేరు వాగు వద్దకు ఊరేగింపుగా భక్తిగీతాలు ఆలపిస్తూ, షియా మతస్తులు బేడ్లు, చురకత్తులతో తమ యధ,వీపుపై మాతం చేస్తూ రక్తాన్ని చిందించారు. మాతం నవాబుకోట నుంచి ఆస్తానం రోడ్డు, పాత బస్టాండ్, పొట్టిశ్రీరాములు విగ్రహం కూడలి మీదుగా జుర్రేరువాగు వరకు సాగింది. అక్కడ పీర్ల ఘాట్ వద్ద పీర్లను శుద్ధి చేసి, వాటిని మళ్లీ ఆయా పీర్ల చావిడిలకు తరలించారు. కర్నూలు, నంద్యాల,హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో పట్టణం కిటకిటలాడింది. పీర్ల నిమజ్జనం నేపథ్యంలో 40 రోజుల పాటు సంతాపం దినాలుగా ఇక్కడి షియా మతస్తులతో పాటు భక్తులు పాటిస్తారు.

కోవెలకుంట్ల: మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకలు శనివారం పీర్ల నిమజ్జనంతో ముగిశాయి. పట్టణ చావిళ్లలోని బీబీ ఫాతిమా, ఇమాంకాశీం, అజరత్ అలీ అక్బర్, చిన్నబార్‌ఇమాం, ఇమాంకాశీం, పెద్దబార్‌ఇమాం, హాజరత్ అబ్బాస్, హాజరత్ అలీ అబ్బాస్, దస్తగిరిస్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్లతోపాటు సొదరదిన్నె గ్రామంలోని బార్‌ఇమాం కాశీం పీర్లను స్థానిక అమ్మవారిశాల మెయిన్ బజార్‌లో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం ఆయా గ్రామ శివారులోని కుందూనది, పాలేరువాగుల్లో పీర్ల నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

బేతంచెర్ల: మొహర్రం వేడుకలు మండలంలో శనివారం ముగిశాయి. మండల కేంద్రం బేతంచెర్లతో పాటు గ్రామాల్లో పీర్లదేవుళ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. డప్పు వాయిద్యాలు, సాంస్కృతి కార్యక్రమాలు, యువకులు ఈలలు, కోలహలం మధ్య ఊరేగింపు వేడుకలా సాగింది.

డోన్/డోన్ టౌన్ : మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. మధ్యాహ్నం నుంచే పట్టణంలోని అన్ని పీర్లచావిళ్ల నుంచి పీర్లస్వాములు ఏటికి బయలుదేరారు. కుల మతాలకు అతీతంగా భక్తులు పీర్లదేవుళ్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పీర్లు ఏటికి ఊరేగింపును తిలకించేందుకు ప్రజలు తరలిరావడంతో ఆయా ప్రాంతాలు కిటకిటలాడాయి. దప్పువాయిద్యాల మధ్య ఊరేగింపులు యువకులు చిందులు వేశారు. చిత్ర విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.

అవుకు: మొహర్రం వేడుకలు శనివారం ముగిశాయి. కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లదేవుళ్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉప్పలపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వర రెడ్డి పీర్లదేవుళ్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా పట్టణంలో కొలువైన మౌళాలి స్వామిని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి దర్శించుకుని ఫాతెహాలు సమర్పించారు. సాయంత్రం నుంచి పీర్లస్వాముల ఊరేగింపు ప్రారంభమైంది. ప్రధాన సెంటర్ నుంచి మార్కెట్ వీధి, బస్టాండ్ మీదుగా పాలేరు వరకు ఊరేగింపు సాగింది.

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేట, బందార్లపల్లె, బెలు, గోరుమానుపల్లెలో శుక్రవారం మొహర్రం ఘనంగా వేడుకలు ముగిశాయి. ప్రత్యేకించి తిమ్మనాయినపేటలో హుశేన్‌స్వామితో పాటు ఇతర పీర్ల స్వాముల ఊరేగింపు వైభవంగా సాగింది. భక్తులు పీర్లను ఎత్తుకొని నిప్పుల గుండంలో నడిచారు. అనంతరం గుండాన్ని పూడ్చాక ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్ల చావిడి నుంచి మేలతాళాలు,డప్పు వాయిద్యాల మధ్య వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి పీర్లను నిమజ్జనం చేశారు. భక్తులు పీర్లకు ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుంచి పీర్లదేవుళ్ల ఊరేగింపును తిలకించేందుకు తరలివచ్చిన భక్తులతో తిమ్మనాయునిపేట కిటలాడింది.

సంజామల: మండల కేంద్రం సంజామలతోపాటు గ్రామాలలో శనివారం ఘనంగా పీర్ల నిమజ్జనం జరిగింది. కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లదేవుళ్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మేలతాళాలు, డప్పువాయిద్యాల మధ్య పీర్లదేవుళ్ల ఊరేగింపు వేడుకగా సాగింది.

ద్విచక్రవాహనాన్ని గుండంలోకి తోసిన యువకుడు

ప్యాపిలి: మొహర్రం సందర్భంగా కిందిగేరిలో పీర్ల చావిడి ముందు వేసిన అగ్నిగుండంలోకి ఓ యువకుడు తన ద్విచక్రవాహనాన్ని తోశాడు. ఇంట్లో చిన్నపాటి గొడవ జరగడంతో తాగిన మైకంలో ఉన్న ఆ యువకుడు క్షణికావేశంతో హోండా షైన్ వాహనాన్ని గుండంలోకి వేశాడు. అప్రమత్తమైన అక్కడున్న వ్యక్తులు బైక్‌ను గుండంలో నుంచి బయటకు తీశారు. అప్పటికే బైక్ పాక్షికంగా కాలిపోయింది.



అవుకులో మౌళాలి స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న చల్లా విఘ్నేశ్వర రెడ్డి



ప్యాపిలిలో పీర్లదేవుళ్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం



తిమ్మనాయినిపేటలో గుండం పూడ్చాక ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



పీర్లను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం



సంజామలలో సంభక్తజనుల మధ్య సాగుతున్న పీర్ల స్వాముల ఊరేగింపు



కుందూనదికి పుష్కలంగా చేరిన నీరు



జోళదరాశి సమీపంలో కళకళలాడుతున్న మినుము

ఖరీఫ్‌కు అనుకూలం

- కుందూనదిలో పుష్కలంగా సాగునీరు
- కళకళలాడుతున్న పంటలు
- సాగుకు రైతన్న సమాయత్తం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇటీవల కురిసిన వర్షాలు ఖరీఫ్‌కు అనుకూలంగా మారాయి. సబ్ డివిజన్‌తోపాటు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. కుందూనది, పాలేరు, కుందరవాగులు ఉధ్రుతంగా ప్రవహిస్తున్నాయి. తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు గతంలో సాగు చేసిన మినుము, పెసర, పత్తి, కంది, మొక్కజొన్న పంటలు కళకళలాడుతున్నాయి. ఆగస్టు 15వతేదీ వరకు ఖరీఫ్ పంటల సాగుకు అదను ఉండటంతో సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 21 వేల హెక్టార్లలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 7 వేల హెక్టార్లలో సాగయ్యాయి. ప్రస్తుత వర్షాలు అనుకూలంగా మారడంతో సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

పెద్దపులుల సంరక్షణ అందరి బాధ్యత

రుద్రవరం: పెద్ద పులుల సంరక్షణ అందరి బాధ్యత అని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా స్థానిక అటవీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఆయన మొక్కలు నాటారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మూడు రోజల నుంచి రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలా ల్లోని పలు గ్రామాల్లో పెద్ద పులుల సంరక్షణ, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పలు అంశాలపై ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. గెలుపొందిన వారికి నంద్యాల డీఎఫ్ఓ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరెడ్డి, ఎఫ్‌బీఓ సురేంద్ర గౌడ్ తదితరులు ఉన్నారు.

శతావధాన పద్య సంపుటి ఆవిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): చిన్నయసూరి సాహితీ సమితి నంద్యాల ఆధ్వర్యంలో ప్రచురించిన శతావధాన పద్య సంపుటిని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ తెలుగు సాహితీ ప్రక్రియలో అవధానం విశిష్టమైనదన్నారు. సాహితీ ప్రియులకు అవధానం ఒక సారస్వత వినోదమని తెలుగు వారికే సొంతమైన అవధానానికి ఆదరణ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రమణమూర్తి సంపాదకత్వంలో రూపొందిన శతావధాని శ్రీ వద్దిపర్తి పద్మాకర్ 14వ శతావధాన పద్య పుస్తకం పాఠకులను అలరిస్తుంది. భావితరాలకు అవధాన ప్రక్రియను పరిచయం చేయడానికి చిన్నయసూరి సాహితీ సమితి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సాహితీ సంస్థ ప్రతినిధులు శేషఫణి, వెంకటేశ్వర్లు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరూ సరిచూసుకో... ఓ సారి!

- ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు చర్యలు
- ఇంటింటి సర్వే చేపట్టిన బీఎల్ఓలు
- మార్పులు, చేర్పులు, కొత్తగా ఓటు నమోదుకూ అవకాశం

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
బనగానపల్లె	1,18,924	1,20,626	34	2,39,584
ఆళ్లగడ్డ	1,12,590	1,14,056	17	2,26,663
శ్రీశైలం	95,776	97,861	45	1,93,682
నందికొట్కూరు	1,04,478	1,06,486	12	2,10,976
నంద్యాల	1,27,176	1,32,924	95	2,60,195
డోన్	1,10,933	1,11,809	81	2,22,823

కొలిమిగుండ్ల: సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల సంఘం ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు జిల్లా అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేసింది. ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దడం, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ తదితర అంశాలపై బీఎల్ఓలు ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. ఆగస్టు 21 వరకు ఈప్రక్రియ కొనసాగనుంది. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటర్లు సైతం తమ ఓటు ఉందా లేదా...వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని సరి చూసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నంద్యాల జిల్లాలో 13,53,923 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితా వెరిఫికేషన్‌లో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. సవరణకు సంబంధించి బీఎల్ఓలు రిజిష్టర్లు కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6, ఓటు తొలగింపునకు ఫారం-7, నియోజకవర్గ పరిధిలో ఓటు బదిలీకి ఫారం-8 దరఖాస్తులను సిబ్బందికి జిల్లా ఎన్నికల యంత్రాంగం అందజేసింది.

సర్వేలో పరిశీలించే అంశాలు ఇవే...

ఓటరు జాబితా వెరిఫికేషన్ భాగంగా ఇంటింటి సర్వేలో బూత్ లెవల్ ఆఫీసర్లు పలు అంశాలను పూర్తి స్థాయిలో పరిశీలన చేయనున్నారు. 18 ఏళ్లు నిండిన వారికి, 2024 జనవరి 1వ తేదీకి వయసు 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీ,నకిలీ ఓట్లు గుర్తించి విచారణ చేసి తొలగించడం. చనిపోయినవారి(మరణ ధ్రువ పత్రం పరిశీలించి నకలు జత చేసి) ఓట్ల తొలగింపు జరుగుతుంది. వందేళ్లు పైబడిన వారిని గుర్తించడం, ఇంటి నంబర్ లేకుండా ఉన్న ఓట్లు, ఒకే ఇంటిపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్ల పరిశీలన చేస్తారు. పూర్తిస్థాయిలో విచారిస్తారు. సర్వీస్ ఓటర్లు(ఆర్మీ)ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలు సరి చేస్తారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభిప్రాయం మేరకు ఏప్రాంతంలో ఉంచాలో తెలుసుకొని ఉంచుతారు. ఒక పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1,500 ఓట్లకు మించి ఉంటే కొత్త పోలింగ్ బూత్‌కు ప్రతిపాదన పంపుతారు. పేర్లు, చిరునామా, పోన్ నంబర్, చేర్పులు, తప్పులు సరిచేస్తారు. ఓటరు అభ్యర్థన మేరకు ఓటు బదిలీ చర్యలు తీసుకుంటారు బీఎల్‌ఓలు.

ఓటరు జాబితా సవరణ షెడ్యూల్

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా వేరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే నెల 21 వ తేది వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా ఆధారంగా ఓట్ల వివరాలను పరిశీలిస్తారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేస్తారు.సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 10 వతేది వరకు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఓటరు జాబితా సవరణలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు స్వీకరిస్తారు. డిసెంబర్ 26 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కారం చేపడుతారు. 2024 జనవరి 1న ఓటర్ల తుది జాబితా సిద్ధం చేస్తారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.



ఓటరు జాబితా పరిశీలిస్తున్న బీఎల్ఓ భార్గవి (ఫైల్)

బీఎల్ఓలకు సహకరించాలి



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సర్వే చేస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లకు ప్రజలు సహకరించాలి. వారు అడిగిన సమాచారాన్ని ప్రజలు అందించాలి. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని జిల్లా అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కొత్తగా ఓటు హక్కు కోసం బీఎల్ఓకు దరఖాస్తు చేసుకోవాలి. మార్పులు, చేర్పులకు మంచి అవకాశం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– దోనీ అల్‌ఫ్రెడ్, తహసీల్దార్

మొక్కలు నాటి సంరక్షించాలి

బనగానపల్లెరూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బ్రహ్మానంద ఆచారి పిలుపునిచ్చారు. మండలంలోని పలుకూరు ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఆంజనేయస్వామి భక్త మండలి సహకారంతో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసులు,ఆంజనేయస్వామి భక్తమండలి సభ్యులు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ మెట్ట నుంచి గ్రామానికి నూతనంగా వేసిన రహదారి వెంట ఉపాధి హామీ పథకం కూలీలు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ కనీసం ఓ మొక్కను నాటి సరంక్షించాలని ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రామనాథం, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్ పిలుపునిచ్చారు.

21,293 ధ్రువీకరణ పత్రాలు అందజేత

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో 27 రోజుల పాటి నిర్వహించిన జగనన్న సురక్ష కా ర్యక్రమం ద్వారా 25 గ్రామ సచివాలయాల పరిధిలో 21,293 ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేశామని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. సర్టిఫికెట్ల పంపిణీలో జిల్లాలో మొదటిస్థానం నిలిచామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పటిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వా రా సాంకేతిక పరంగా ఇంత వరకు ప్రభుత్వ ప థకాలు పొందని వారిని గుర్తించి అర్హులైన వారి కి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీఓ వివరించారు.